

# ఆటకట్టు

శ్రీపతి

వే ణుగోపాల్ కొద్దిసేపట్లో తాను పుట్టి పెరిగిన మట్టిమీద అడుగు పెట్టబోతున్నాడు. అక్కడ తన మనుషులను చూస్తాడు. తనను పెంచి పెద్ద చేసిన ఈ ఊరు అందాలను చూస్తాడు. తన పాతికేళ్ల తొలి జీవితానికి సాక్ష్యంగా నిలచిన నేస్తాలను కలుసుకుంటాడు.

కొబ్బరితోట మధ్యనించి, మెలికలు తిరిగిపోతున్న తారురోడ్డు మీంచి నిశ్శబ్దంగా పోతోంది కారు. తన చిన్ననాటి మిత్రుడు శంకర్రావు తన కోసం నిన్న విమానాశ్రయానికి వచ్చాడు. ఇవేళ తన కారులో స్వగ్రామం తీసుకుపోతున్నాడు.

వర్షాకాలపు చల్లటి సాయంత్రం. మబ్బులతో అందమైన ఆకాశం. కళింగ సముద్రపు నేపథ్యంలో స్వప్నలోకం లాంటి ఆ తోటల మధ్య గొంతు విప్పి పాటలు పాడుకుంటూ విహరిస్తున్న పవనాలు. ఆ చెట్లూ, ఆ తోటలూ, అక్కడి నేలా, గాలీ, ఆకాశమూ అన్నీ నిండు హృదయంతో తనను పలకరిస్తున్నట్టున్నాయి. ఇరవైయేళ్లు తన జీవితానికి మరుగైన అరుదైన అందాలవి! అక్కడ ప్రకృతి పరిమళాలకి పులకించిపోతోంది మనసు.

యునైటెడ్ స్టేట్స్‌లో ఇరవైయేళ్లపాటు ఉద్యోగ జీవితంలో నిండా మునిగిపోయి ఇప్పుడు మనసుపుట్టి స్వదేశం తిరిగివచ్చిన వేణుగోపాల్ శంకర్రావును చూసి ఎంతో ఆశ్చర్యపోయాడు. తనకు తెలిసిన చిన్న రైతు శంకర్రావు ఇప్పుడు మంత్రి పుంగవుడిలా ఉన్నాడు. అతడి రూపురేఖల్లో ఐశ్వర్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. తమ్ముడిని సైతం అతడు గుర్తు పట్టలేకపోయాడు. పంజాబీపిల్ల అయిన మరదలిని ఇదే తొలిసారి చూడటం వల్లా, పిల్లలంతా ఫ్రాక్స్‌లో, జీన్స్‌లో వుండటంవల్లా, తమ్ముడు కుర్తా పైజామాలో రావటం వల్లా వాళ్లు తమంతట తాము దగ్గరకు వచ్చి పలకరించితే తప్ప తాను వాళ్లను గుర్తుపట్టలేకపోయాడు.

తల్లీ తండ్రీ ఇవేళ బతికి ఉంటే ఎంత గర్వించేవాళ్లో! తానెంత సంతోషించేవాడు! వాళ్లు చనిపోయినప్పుడు కూడా తాను రాలేకపోయాడు. ఆ ఇద్దరి మరణాలు హఠాత్తుగానే జరిగి, ఆ వార్తలు చేరేసరికి రెండుసార్లు కూడా తాను ప్రయాణాల్లో ఉండటంవల్ల జాప్యం అయింది. ఆ దు:ఖ సమయంలో రాలేకపోయినందుకు అడ్డం వచ్చిన అవాంతరాలను తలంచుకున్నప్పుడల్లా దుఃఖంతో కుమిలిపోతాడు. తనమీద తనకే కోపం వస్తుంది. తన కీర్తిప్రతిష్ఠలు, భోగభాగ్యాలు, ఈ విజయాలు అన్నీ నిరర్థకం అనిపిస్తాయి. పశ్చాత్తాపం ముంచుకొచ్చి క్రుంగిపోతాడు.

రాజ్యలక్ష్మి బావుందా అని గుండె లోతుల్లోంచి పదేపదే ఉప్పొంగి వస్తున్న ప్రశ్న గొంతులోనే ఆగిపోతున్నది. ఇంకాసేపట్లో రాజ్యలక్ష్మిని తాను ఎట్లానూ చూస్తాడన్న ఆలోచన వచ్చి నిగ్రహించుకుంటున్నాడు.

శంకర్రావు దారిపొడుగునా ప్రపంచ రాజకీయాలు మాట్లాడుతున్నాడు. తూర్పు యూరప్ దేశాల్లో కుప్పకూలిపోతున్న కమ్యూనిస్ట్ ప్రభుత్వాలు, జర్మన్ ఐక్యత, సోవియట్ యూదుల ఇజ్రాయెల్ వలస పెట్రోడాలర్లతో ఇస్లామ్ దేశాలలో మతశక్తుల విజృంభణ, జపాన్ పారిశ్రామిక ఆధిపత్యం, నెల్సన్ మండేలా నాయకత్వంలో జాతీయ విమోచన పోరాటం, బోఫోర్స్ శతఘ్నుల కొనుగోలులో వందలాది కోట్ల రూపాయల కైంకర్యం,

గోర్బచేవ్ సిద్ధాంత ప్రశాంత విప్లవం ఆరోతరగతి కూడా చదవని శంకర్రావు నోట విని ఆశ్చర్యపోతున్నాడు. టైమ్, న్యూస్‌వీక్, ఎకనమిస్ట్ స్థాయి రాజకీయాలు, కొంతసేపు కాశ్మీర్ గురించి మాట్లాడి కాశ్మీర్ నిన్నమొన్నటి వరకు హిందూరాజ్యమని, హిందూ రాజులు పాలించారని చెప్పి, ఆ సంగతి ఎవరూ మాట్లాడరేం అంటున్నాడు.

నిన్న విమానాశ్రయంలో కలుసుకున్నప్పటినించీ ఇంతవరకు శంకర్రావు తన యోగక్షేమాలు గురించి గానీ, ఎదుటివారి సుఖదుఃఖాల గురించిగాని ప్రస్తావించలేదు. శంకర్రావుతో కష్టసుఖాలు చెప్పుకోవాలనుకున్న వేణుగోపాల్‌కి శంకర్రావు వార్తాపత్రికల్లోని పతాక శీర్షికలు చదవడం నిరుత్సాహం కలిగించి, నీరసించి పోయాడు. అతడికి ఊళ్లో మనుషుల ముచ్చట్లు వినాలని ఉంది. వాళ్ల కథలూ కన్నీళ్లూ వాళ్ల సుఖసంతోషాలూ, వాళ్ల మంచిచెడులూ వినాలని ఉంది.

శంకర్రావు రాత్రంతా దేశంలో కొత్తగా శక్తి పుంజుకుంటున్న కులోన్మాదం గురించీ, అవినీతి గురించీ చెప్పాడు. హరిజన గిరిజన వెనుకబడిన తరగతుల పుద్ధరణ పేరుతో జరుగుతున్న రాజకీయ దుర్మార్గం పట్ల తన అసహనభావం ప్రకటించాడు. ఈ విధానాల వల్ల పరోక్షంగా దీర్ఘకాలిక శాశ్వత ప్రయోజనాలను పొందుతున్నవి అగ్రవర్ణాల వాళ్లేనని నిర్ధారించాడు. ఈ దేశంలో ఉద్యోగాలు దొరకనందున అగ్రవర్ణాలవారు విదేశాలలో ఉన్నత పదవులు సంపాదించుకుని ఘనవిజయాలు సాధించుకుంటున్నారని సోదాహరణంగా రుజువు చేశాడు. వేణుగోపాల్ ఇంకా ఆలోచనలలో మునిగి తేలుతూ ఉండగానే కారు ఊరుకు ఎడంగా ఉన్న కొబ్బరితోటలోని శంకర్రావు బంగళా చేరుకుంది. ఆ బంగళా అమెరికాలోని సంపన్న కుటుంబాల విల్లాలను గుర్తుతెస్తోంది. దాదాపు ఇరవై ఎకరాల కొబ్బరితోటలో ఆధునాతనంగా మహానగరాలలోని భవనాలమోస్తరుగా కట్టించుకున్న అపురూపమైన బంగళా అది. విశాఖపట్నం సముద్రం ఒడ్డున దసపల్లా లే అవుట్‌లో లక్ష డాలర్లు పెట్టి తన కోసం కొనుక్కున్న బంగళా దీని ముందు దిగదుడుపే.

ఇంత ఉన్నతాభిరుచి, ఈ ఐశ్వర్యం పల్లెటూళ్లో ఇరవైయేళ్ల క్రితంవరకు చిన్న రైతుగా ఉన్న శంకర్రావుకు ఎట్లా వచ్చిందో అంతుచిక్కలేదు వేణుగోపాల్‌కి.

దేశం అభివృద్ధి చెందటం అంటే ఇదే! ఈ మారుమూల ఊళ్లో సైతం ఇట్లాంటి భవనం వెలిసిందంటే అదే చాటుతుంది దేశప్రగతి అనుకున్నాడు వేణుగోపాల్.

ఇంట్లో అడుగుపెట్టిన తర్వాత లోపలి అందాలూ అలంకరణలూ చూసి విస్తుపోయాడు వేణుగోపాల్. ఇటాలియన్ పాలరాతి నేల, రోజ్‌వుడ్ ద్వారాలూ, తలుపులూ కిటికీలూ, గ్రైనైట్ క్లాడింగ్, వైర్‌కట్ బ్రిక్ గోడలూ, గొప్ప ఇంటీరియర్ డిజైనర్ చేసిన నిరాడంబరమైన, చుట్టుపక్కల పరిసరాలకు నప్పిన అలంకరణ. ఆధునిక చిత్రకారుల పెయింటింగ్‌లు గోడలకి, శిల్పాలు, ప్రాచీనకాలపు అమూల్యమైన కాంస్య విగ్రహాలు. కొన్ని గోడల మీద టెర్రకొట్టా బంకూరా బొమ్మ పెంకులు. తివాచీలు, ఇండోర్ ప్లాంట్స్. ఢిల్లీలో పేరు మోసిన ఒక ఆర్కిటెక్ట్ మూడేళ్లపాటు నిర్మించిన బంగళా అది! బాలకృష్ణ దోషి, చార్లెస్ కొరియా, రాజ్ రావెల్, సతీష్‌గుజ్రాల్ వంటి ప్రసిద్ధ ఆర్కిటెక్ట్‌ల పేర్లను దొర్లించాడు తన మాటల్లో. వాళ్లంతా తన స్నేహితులట!

మొదటిరాత్రి శంకర్రావు ఇంట్లో విందు. శంకర్రావు మిత్రులు ఆరేడుగురు వచ్చారు. వాళ్లలో ఇద్దరు అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు. ఇద్దరు ప్రభుత్వాధికారులు. ఒక డాక్టరు. ఒక కంట్రాక్టరు. ఒక అడ్వొకేట్. సాయంత్రం తాము ఇల్లు చేరిన తర్వాతనే ఈ ఏర్పాట్లు జరిగినట్లున్నాయి. ఫోన్‌లో శంకర్రావు మాట్లాడటమూ, రెండు కార్లు బయటికి వెళ్లడమూ ఇప్పుడు వేణుగోపాల్‌కి గుర్తొస్తోంది.

ఆ వచ్చిన మిత్రులంతా రేపు సెలవుదినం అనుకుంటూ విందును రాత్రి రెండుగంటల వరకు సాగదీశారు. వాళ్లలో డాక్టర్ ముప్పయ్యేళ్లవాడు. హిందీ తెలుగు పాటలు గొప్పగా పాడాడు. ఇట్లాంటి గొంతే ఉంటే యూరప్‌లోనో అమెరికాలోనో అయితే గొప్ప గాయకుడై ప్రపంచాన్ని జయించేవాడు. మిగిలిన వాళ్లు ఎవ్వరూ వేణుగోపాల్‌ని ఆకర్షించలేదు. కాంట్రాక్టర్ వినయం చూస్తేనే తెలుస్తోంది, తడి గుడ్డతో గొంతు కోసే రకమని. అయ్యా అయ్యా అంటున్నాడు ప్రతి మాటకీ. ఎమ్మెల్యేలు ఇద్దరూ కుర్రవాళ్లే. అబగా స్కాచ్ తాగి తాపీగా తినడం మొదలుపెట్టారు. మధ్య మధ్య బూతు జోకులు చెప్తున్నారు. మేజిస్ట్రేటు నోటిమాట జారితే ఏమవుతుందోనన్నట్టు కూచుని పొడిమాటలతో చిరునవ్వు నవ్వుతున్నాడు. అక్కడ ఆ మనుష్యుల్లో గ్రహపాటున వచ్చి కూచున్నట్టు కనిపిస్తున్నాడు. తాగటం మొదటి రౌండ్‌లోనే తనకుమల్లే ఆపేసి అక్కడ మనుషుల చేష్టలు చూసి సంతోషిస్తున్నాడు. పోలీస్ అధికారి మాత్రం స్టేట్స్‌లో సామాన్య జనం జీవితం గురించి అడిగి కుతూహలంగా వింటున్నాడు. ఆ దేశంలో వర్ణవివక్ష గురించి తన భయసందేహాలను ఆయన వెలిబుచ్చినప్పుడు మనదేశంలో ఉన్న కుల ఉన్మాదం అంతకన్నా ప్రమాదమైంది, ఆ దేశం నించి మనం నేర్చుకోవలసిన ప్రాథమిక అంశాలు ఎన్నో ఉన్నాయి అని

చెప్పి ఉప్పుతిన్న దేశం గురించి విధేయతతో, అభిమానంతో మాట్లాడాడు వేణుగోపాల్. 'పదిమందికి పెట్టే చెయ్యి' అని స్తుతించారు శంకర్రావును అక్కడున్న వాళ్లంతా.

వేణుగోపాల్ మనసు అక్కడలేదు. తాను ఆశించినట్టుగా తను పుట్టి పెరిగిన ఇంట్లో ముందు అడుగు పెట్టలేకపోయిన అవాంతరాలకు, ఆ ఊళ్లో ఉండి రాజ్యలక్ష్మిని ఇంతవరకు చూడలేకపోయినందుకు మనసు వ్యథ చెందుతున్నది. ఒంటరిగా, తోటలో చెట్ల కింద, ఆరుబయట చిన్న మంచం వేసుకుని పడుకోవాలనిపిస్తున్నది.

రెండోరోజు కూడా శంకర్రావు అతడిని ఇంటి నించి కదలనివ్వలేదు ప్రేమతోనే, అభిమానంతోనే. కాని ఎంతో ఇబ్బందిగా ఉంది వేణుగోపాల్‌కి. బెడ్ టీ, బ్రేక్ ఫాస్ట్ అంతా తన గదిలోనే. ఆరోజు ఇంట్లో సత్య నారాయణ వ్రతం. దైవభక్తుడయిన వేణుగోపాల్‌కి వ్రతం దగ్గర బంధించినట్టే ఉంది. వ్రతం తర్వాత భోజనాలు ముగిసేసరికి సాయంత్రం మూడున్నర అయింది. సాయంత్రం బయటికి పోవాలనుకుంటే ప్రెసిడెంట్ జగ్గనాయుడు తనని చూట్టానికి వస్తున్నట్టు కబురు వచ్చిందని తనని బయటికి పోనివ్వలేదు శంకర్రావు. జగ్గనాయుడు ఆ ఊరుకు మకుటంలేని మహారాజు అన్న సంగతి వేణుగోపాల్‌కు తెలిసిందే. అయినా అతడి జాబితాలో జగ్గనాయుడు పేరు లేదు. చిన్నప్పుడు జగ్గనాయుడు అంటే పాముని చూసినంత భయం. ఇప్పుడు అసహ్యం. ఆ ఊళ్లో పరువు మర్యాదలకు సంజీవునాయుడు ఇల్లూ, అధికారదర్పాలకు జగ్గనాయుడు ఇల్లూ పేరుపడ్డాయి. 'జగ్గనాయుడు నీ కోసం వస్తున్నట్టు కబురు చేసిన తర్వాత నీవు బయటికి వెళ్లిపోతే మర్యాదగా ఉండదు,' అని శంకర్రావు బయటికి కదలనివ్వలేదు. ఇప్పుడు జగ్గనాయుడుకు ఆ ఊళ్లోనేకాదు, చుట్టుప్రక్కల ఇరవై పాతిక ఊళ్లలో ఎదురులేదట. జిల్లాలో పెద్ద తలకాయలకు లక్షల మొత్తంలో అప్పటికప్పుడు అప్పు కావలసివస్తే జగ్గనాయుడే దిక్కట !

నిన్న వచ్చిన స్నేహితులంతా సాయంత్రం వెళ్లిపోవటంతో శంకర్రావుకు వేణుగోపాల్ చిక్కిపోయాడు.

అలవాటులేని తిండికావటంవల్లా, కట్టుబాట్లు విడిచిపెట్టి జిహ్వాచాపల్యంతో తెలుగు వంటకాలు తినటంవల్లా సాయంత్రానికి అజీర్ణ లక్షణాలు కనిపించసాగాయి వేణుగోపాల్‌కి.

జగ్గనాయుడు నుదుట నామాలతో, కుట్టించుకున్న పల్చటి బనీనుతో, గ్లాస్కోపంచెతో, నోటిన సిగరెట్ సైజు చుట్టతో, ఈ ఇరవైయేళ్లలో ఎలాంటి మార్పుని లెక్క చేయకుండా పాతకాలపు పెద్దమనిషిలా కనిపించటం వేణుగోపాల్‌కి సంతోషం అయింది.

వస్తూనే జగ్గనాయుడు ఎంతో అభిమానంగా పలకరించాడు. తన కుటుంబం యోగక్షేమాల గురించి కుశల ప్రశ్నలు వేయడం తొలిసారి జగ్గనాయుడే. భార్యనూ పిల్లలనూ తీసుకురానందుకు కోప్పడ్డాడు. పిల్లల చదువుల తీరుతెన్నులు అడిగాడు. ఎంతో మర్యాదగా ప్రవర్తించాడు. మన ఊరుకు పేరు తెచ్చావ్ అదే సంతోషం అని సంబరపడ్డాడు.

జగ్గనాయుడు ఇంట్లో ఆ రాత్రి విందు.

విందుకు జగ్గనాయుడు అల్లుడు, జగ్గనాయుడితో సాటిరాగల ముగ్గురు నలుగురు దగ్గర వాళ్లు, జగ్గనాయుడు చిన్న తమ్ముడు, శంకర్రావు వచ్చారు.

ఆ విందులో మాటల్లో తెలిసిందేమిటంటే రాజ్యలక్ష్మి భర్త సంజీవునాయుడు విశాఖపట్నంలో ఇప్పుడు జైలుశిక్ష అనుభవిస్తున్నట్టు. ఏభై ఎకరాల ఆస్తితో ఒకప్పుడు ఆ ఊళ్లో పరువు మర్యాదలకు పేరు మోసిన సంజీవునాయుడుకు ఇప్పుడు ఇంటి దగ్గర ఎనిమిదెకరాల తోట తప్ప మరేం మిగలలేదట. ఎదిగిన నలుగురు కొడుకుల్లో ఎవరూ పనికిరాలేదట. అంతా ఊళ్లో ఉండి తిని తిరుగుతున్నారట! జగ్గనాయుడు కనికరించి వదిలేయబట్టి ఆ ఎనిమిది ఎకరాల తోట మిగిలి బతుకుతున్నారట.

*

తోటల్లో ఊరు. ఊరులోపల తోటలు. లోపల అడుగుపెట్టే వరకు కనిపించని ఊరు. ఊళ్లో ఏ ఇంటి నించి చూసినా ఆకాశంలో అల్లుకున్నట్టు, పందిరి వేసినట్టు కొబ్బరికమ్మలూ, చెట్లకొమ్మలూ.

ఊరుకు నైరుతిగా రోడ్డుకు దాదాపు ఫర్లాంగ్ దూరం లోపలికి శంకర్రావు బంగళా ఉండగా సంజీవునాయుడు ఇల్లు ఊరుకు ఈశాన్యంగా తోటలో ఉంది. ఆ ఊళ్లో ఇళ్లు ఒకచోట గుమిగూడినట్టుగా కాక అక్కడక్కడ పాతిక ముప్పయి ఇళ్లు చెదురుమదురుగా వుంటాయి. తాటి కమ్మలపై కప్పులతో చిన్న చిన్న మట్టి ఇళ్లే ఎక్కువ. వాకిళ్లలో పూల మొక్కలు, కూరగాయల పాదులు, మొక్కలు, పందిళ్లు, అరటిపాదులు, తులసికోటలు. అక్కడొకటీ ఇక్కడొకటీ పాత కాలపు పెంకుటిళ్లు. కొత్త కొత్త డాబా ఇళ్లు. ఇళ్ల మీద టెలివిజన్ ఏంటీనాలు, కంకరరోడ్లు, ఎలక్ట్రిక్ తీగెలు, టెలిఫోన్ స్తంభాలు, మోటార్ బోర్‌లు, తోటల్లో చెట్లనీడన కళ్లాల్లో ట్రాక్టర్‌లు, జీప్‌లు, ఇండ్ల ముందర మోటార్ సైకిళ్లు,

స్కూటర్‌లు, ఊరులోపలకి చొచ్చుకు వచ్చిన ఆధునిక నాగరికత సంకేతాలు. ఆ ఊరు రూపురేఖలు మారి పోయాయి.

'బాబాయి, అమ్మ నిన్ను తీసుకురమ్మన్న'దని రాజ్యలక్ష్మి కూతురు దమయంతి ఉదయం వచ్చి శంకర్రావు ఇంట్లో బందీగా ఉన్న వేణుగోపాల్‌ని విముక్తి చేసి తనతో తీసుకుపోతున్నది.

ఊళ్లో మనుషుల కట్టూ బొట్టూ అలంకరణ తీరూ మారింది. నుదుట నామాలతో, జుత్తు ముడితో, పంచెకట్టు భుజాన తువ్వాలుతో పాతకాలం పెద్ద మనుషుల సంఖ్య తగ్గిపోయింది. పేంటులూ, షర్టులూ, లుంగీలూ, జీన్స్, టీషర్టులూ, చేతి గడియారాలూ, క్రాఫ్‌లూ యువతరం కనిపిస్తోంది.

ఊరు మధ్యనించి పోతున్నారు.

దారిపొడవునా పలకరింపులు. వేణూ, బాగున్నావా నాయినా, నాయినా ఎన్నాళ్లయిందిరా చూసి, మమ్మల్ని మరచిపోయినావా నాయినా వేణన్నా బాగున్నావా? పెద్దనాన్నా ఎప్పుడొచ్చినావు మనదేశం? పెద్దమ్మా, అన్నయ్యా, తమ్ముళ్లూ బాగున్నారా? మామయ్యా బాగున్నావా? అక్కనీ బాబుల్నీ తీసుకు రాలేదా? మేమంతా ఇన్నాళ్లకు మతిబడ్డామా నాయనా? పెదబాబూ బాగున్నారా అంతా? వేణూ? నాయినా ఎంత మరిచిపోయినావురా మా అందర్నీ! నాయినా వేణూ, ముసలమ్మ చూస్తానంటున్నది, చూపు తగ్గిపోయింది ఒకసారిటు వచ్చి కనబడు నాయినా! ఏం మరదీ ఎన్నాళ్లకు నీ దర్శనం! అక్కయ్య వచ్చిందా! అందర్నీ తెచ్చి ఒకసారి మాకు చూపకూడదా! ఏంరా అల్లుడా ఒక్కడివేనా రావడం? అమ్మాయిని కూడా తీసుకురావద్దా? తమ్ముడూ, గుర్తుపట్టలేకపోయినాన్రా చూపు మందమయింది. ఆ దేశంలోనే ఉండిపోతావా? ఎంత మారిపోయినావ్రా? తెల్లబడ్డావు. జుత్తు నెరిసి పోయింది! మన ఊరుకు పేరు తెచ్చినావు నాయినా! అమ్మా అయ్యా చచ్చిపోయినప్పుడు తప్పక వస్తావను కున్నాంరా బాబూ, ఆ కబురు నీకు అందలేదా? అమ్మా అయ్యా బతికున్నప్పుడొస్తే వాళ్లు చూసి ఎంత పొంగి పోయేవాళ్లో! వాళ్లకా అదృష్టం లేకపోయింది కదా! ఎప్పుడూ మీ అమ్మ నీ మాటలే చెప్పేది నాయినా! నీ ఉత్తరం వచ్చినప్పుడు పదిసార్లు చదివించుకుని వినేది! వేణుబాబేనా? మా అమ్మ చెప్తే తెలిసింది. మా కళ్లకు కనబడతావో లేదో అనుకున్నాం నాయినా! నీ తల్లీ తండ్రీ ఉన్న రోజుల్లో వాళ్లను సాధించినవాళ్లే నీకు మర్యాదలు ఇప్పుడు చేస్తున్నారు.

హృదయాన్ని తట్టి ముద్దాడే ప్రేమలు. మనసును అమాంతం కావలించుకునే అభిమానాలు. తల నిమిరి ఒడిలోకి తీసుకునే మమకారాలు. కళ్లలో ఆనంద బాష్పాలు ఉప్పొంగే తన్మయానుబంధాలు. చల్లని చూపులు, కళ్ల నిండా చూస్తే కడుపు నిండిపోయే సంతోషాలు, మనసు అట్టడుగునుండి పెల్లుబికే అనురాగాలు.

'బాబాయి' అన్న దమయంతి పిలుపుతో మొద లయిన మనసున్న మనుషుల ఆ నిండు ప్రేమలు వేణుగోపాల్‌ని ఉక్కిరి బిక్కిరి చేశాయి. అతడి కండ్లు ఆనందాశ్రువులను కురిశాయి.

తన స్వగ్రామంలో తాను అడుగుపెట్టినట్టు ఆ క్షణాన మొట్టమొదటిసారిగా అన్పించింది వేణు గోపాల్‌కి. తన జన్మభూమి మట్టివాసన వాళ్లంతా. తన తల్లితండ్రుల తేజోరేఖలు ఆ జనమంతా. ఆ ఊరు ఆత్మరూపం అక్కడ సర్వత్రా. ఆ ఊరు తన దేవా లయం. గత ఇరవైయేళ్లలో అతడి మనసు కోల్పోయిన మమతల సౌందర్యం ఇప్పుడు తెలుస్తోంది.

దార్లో ఆ పెద్ద పనసచెట్టు పక్కన ఉన్న తాటి కమ్మల ఇంటి ముందు పాదాలు ఆగిపోయాయి. ప్రపంచం మొత్తం చూసిన అతడి కండ్లకి ఆ చిన్న మట్టి ఇల్లే అందాలదీవి. అది తన స్వర్గం. అక్కడ వేణు గోపాల్‌కి తల్లీ తండ్రీ, నాన్నమ్మా, తాతయ్యా, ఆ ఊళ్లో పెద్దలంతా జ్ఞాపకాలై కనిపిస్తున్నారు. మృత్యువును జయించిన అమరత్వంతో ప్రత్యక్షమవుతున్నారు. ప్రపంచం మాయ అంటే ఇదేనేమో! చావు అన్నది వొట్టి భ్రమలాగ తోచింది. అంతా ఉన్నట్లే. తన చుట్టూ కండ్లకు కనిపించనంత మాత్రాన లేనట్టా? తన ఆత్మ చుట్టూ గత రెండు దశాబ్దాలు పొరలు పొరలుగా పేరు కున్న మాలిన్యం పెంకులు వాటంతటవే పగిలి రాలిపో తున్నాయి. శుద్ధమైన తేజస్సుతో తల్లీ తండ్రీ కని పిస్తున్నారు.

వేణుగోపాల్ చాలాసేపు మౌనంగా ఉండి పోయాడు. ఆ ఇంట్లో బంధువులే ఇప్పుడు ఉంటు న్నట్టు తమ్ముడు రాశాడు. ఆ ఇంట్లో రోజూ దీపం వెలిగించే దిక్కు వాళ్లే అయ్యారు.

జగ్గునాయుడు తమ ఇల్లు కలుపుకున్నప్పుడు స్థలం ఇచ్చి ఇల్లు కూడా కట్టించి ఇస్తానన్నాడట. తర్వాత వాళ్లు ఇల్లు ఖాళీచేసి ఈ ఇంట్లో దిగిన తర్వాత లెక్కలు కట్టి పాత అప్పుకు వడ్డీకింద సరిపోయిందన్నాడట. ఆ అప్పు అంతకుముందు కో ఆపరేటివ్ అప్పు తీసుకొని చెల్లించినదే! అసలు అప్పు ఇంకా మిగిలే ఉందట.

చిన్నమ్మ చెప్తోంది.

చిన్నయ్యకి జబ్బు వచ్చినప్పుడు అప్పు దొరక్క ఆస్పత్రికి తీసుకు వెళ్లలేకపోయినందు వల్ల చిన్నయ్య మట్టిలో కలిసిపోయాడట.

'నా ఉసురు తగిలి వాడి శిరసు పగల,' అని శపిస్తోంది చిన్నమ్మ జగ్గనాయుడును.

దమయంతి కళ్లలో కన్నీరు.

పనసచెట్టు కింద మంచంమీద కూచున్నాడు వేణుగోపాల్. ఆ చెట్టు నీడనే తన బాల్యం గడిచింది. ఆ చెట్టు తనకు రెండో తల్లి. పిల్లలతో ఆడుకునే చేతుల్లా ఆ చెట్టుకొమ్మలు కిందికి వేలాడి సాగి వుంటాయి. ఒక కొమ్మమీంచి మరో కొమ్మకి, పై కొమ్మలకి, ఎక్కుతూ దిగుతూ దుముకుతూ ఆ చెట్టుతోనే ఆటలు.

ఇప్పుడా చెట్టు కింద రెండు ఆవులు, రెండు దూడలు, ఎంతో ముద్దొస్తున్నాయి. తనవేపు ప్రేమతో చూస్తున్నాయి. తన తల్లిదండ్రులు తనకోసం ఈ జన్మ నెత్తారేమో!

పనసచెట్టు కానుకుని కొబ్బరిమొక్కల పళ్లెరం దాదాపు ముప్పయి నలభై మొక్కలు, పెరడంతా చేమంతులూ, గులాబీలూ, క్రోటను మొక్కలూ, ఆ వెనుక ఐదారు కొబ్బరిచెట్లు అంతే. తర్వాత కొబ్బరి తోట. ఆ తోటలో సపోటాచెట్లు, ఉసిరిక చెట్లు, సువర్ణ రేఖ మామిడిచెట్లు రెండు. మధ్య పెద్ద చింతచెట్టు. పెరటి పొడవునా జీడిమామిడి చెట్లు. తాడిచెట్లు. మధ్య మధ్య మొగలిపొదలు. తమ చదువుల కోసం చేసిన అప్పుల కింద ఆ తోట జగ్గనాయుడు చిన్నతమ్ముడు ఆస్థిలో కలిసిపోయింది!

ఇంట్లో పేదరికం. అయినా చిన్నమ్మ ముఖం మీద గంభీరమైన నిండుతనం. జీవితంలో రోజూ పోరాటమే. ఏది గెలుపో ఏది ఓటమో భేదం తెలియని పోరాటం. గెలుపు ఓటముల మధ్య భేదమే లేని పోరాటం. చేతిలో ఏ ఆయుధమూ లేనివాడు దెబ్బలు తింటూ, నెత్తురు కార్చుకుంటూ మొండిగా సాగిస్తున్న పోరాటం.

చిన్నమ్మ ముఖం మీద బొట్టు అస్తమించింది. చిన్నమ్మ కన్నీళ్లు ఇంకా కారుతూనే ఉన్నాయి.

'అన్నయ్యా' అనుకుంటూ చేతిలో తొలిచిన నీళ్ల కొబ్బరికాయ పట్టుకుని ఇరవైయేళ్ల యువకుడు, ముఖంనిండా ఆనందంతో వచ్చి, తాగటానికి వీలుగా కొట్టిన కొబ్బరికాయను చేతిలో పెట్టాడు.

కొబ్బరితోటల్లో రెండురోజులుగా ఉంటున్నా మొదటిసారిగా కొబ్బరినీళ్లు తాగటం. అమృతం శరీరం లోని రక్తనాళాల్లోకి ప్రవహించినట్టయింది.

''ఇదిగో ఇట్లా ఉన్నాం నాయనా. ఉన్ననాడు తిని, లేనినాడు పస్తుండి ఈ ఊళ్లోని నరకోతల వాళ్లతో హింసలు పడీపడీ ఇలా బతుకుతున్నాం నాయినా,'' అని దమయంతిని చూసి, ''ఎందుకు తల్లీ ఏడుస్తావ్,'' అని తనదగ్గరకు తీసుకుని తన చేత్తో కన్నీరు తుడిచింది.

''నాయనా సంజీవుబాబు ఒక్కడే కోటలాగ నిల బడ్డాడు.''

తమ్ముడు చదువుకోలేదట! బడికి వెళ్లేవాడు కాదట!

ప్రపంచంలో ఒక పెద్ద ప్రమాదంనించి తమ్ముడు తప్పించుకున్నందుకు సంతోషమైంది వేణుగోపాల్‌కి. యోధుడులాగ కనిపిస్తున్నాడు. ఈ పోరాటంలో పుట్టి పోరాటంలో పెరుగుతున్న సుశిక్షితు డైన యోధుడై కని పిస్తున్నాడు. భయభీతుల ఛాయల్లేని ముఖం. తట్టు కోలేక, చదువు పేరుతో ఈ పోరాటం నించి తప్పించు కుని, సముద్రాలు దాటి పారిపోయిన భీరువు తాను!

వాళ్లకు తాను చెప్పేది ఏముంటుంది?

వాళ్లనించి తానే నేర్చుకోవాలి.

దమయంతికి ఈ బాధలన్నీ తెలిసినవే అయినా కొత్తగా తాకినప్పుడల్లా కంపించిపోతున్నది. అట్టేసేపు అక్కడ ఉండటం మంచిది కాదనిపించి చిన్నమ్మకు మళ్లీవస్తానని చెప్పి పనసచెట్టు కింద వాకిట మంచం మీంచి లేచాడు వేణుగోపాల్.

అట్లా పది అడుగులు కదిలి ముందుకు వెళ్లాడో లేదో చేతిలో పాలఉట్టితో తోటనించి పాలు తీసుకుని వస్తున్న దేవుడుతాత ఎదురై, దగ్గరగా వచ్చి, నిలబడి పోయి, కళ్లలోకి కళ్లు పెట్టి చూసి, అవునా కాదా అన్నం సందేహంలో పడి నిర్ధారించుకుని, ''తాతా నువ్వేనా,'' అని పలకరించాడు.

''నేను దేవుడు తాతా వేణుని, రామ్మూర్తి నాయుడు పెద్ద కొడుకుని.''

''కనిపించి పోయినావురా నాయినా, నిన్ను చూస్తానో చూడలేనో అనుకున్నాను. ఇరవైయేళ్లయిందా నీవు ఇక్కడకు వచ్చి?'' అని తనని చేత్తో పట్టుకున్నాడు. భుజాన చెయ్యేసి దగ్గరకి తీసుకున్నాడు. ''ఏమో ఎప్పుడు పిలుపు వస్తుందో అని ఆ పిలుపుకోసం ఎదురు చూస్తున్నాను. మరి మీ అయ్యా, చంద్రయ్యా, నాగరాజూ, నర్రోడూ, అంతా ముందే వెళ్లిపోయినారు. నాలాంటి వాళ్లు ఉండిపోయినారు.''

''నాగరాజు కూడా లేడా?''

వయసులో పులితో పోరాడిన వీరుడు దేవుడు తాత. ఆ శరీరం శుష్కించినా చేవ తగ్గలేదు ఇప్పటికీ.

‘‘నాయినా పామున్నాదీ అంటే అది ఎప్పుడు ఎవరిని కాటేస్తుందో చెప్పలేము. విషప్పురుగు. కాటే సిందా- సరి!’’ అని పేర్లతో అవసరం లేకుండా స్వభావం గురించి వ్యాఖ్యానించాడు దేవుడు తాత.

‘‘అయితే నాయినా పాముకు కూడా ధర్మం వుంది. అపాయం- దాని ప్రాణానికి అపాయం అని భయపడినప్పుడే అది కాటువేస్తుంది. లేకపోతే పారిపో తుంది. కాని మనిషి ఉన్నాడే నీచుడు,’’ అని ఆగి పోయాడు.

మనసులో హోరు. చుట్టూ ఉన్న ప్రపంచమంతా అప్పటికప్పుడు గడ్డ కట్టుకుపోయింది. పైకి మామూలు జబ్బులతో, ఇబ్బందులతో కష్టాలతో చచ్చిపోయినట్టు చెప్పుకున్నా నిజానికి అవి దౌర్జన్యానికో, దుర్మార్గానికో, కుట్రకో, మోసానికో, ద్రోహానికో, దగాకో, ధూర్తత్వానికో నేలకొరిగిన జీవితాలే.

గాలివానలెన్ని వచ్చినా లెక్కచెయ్యని చెట్టులాగ కన్పిస్తున్నాడు దేవుడుతాత.

‘‘ఆ సంజీవు- ఈ పిల్ల తండ్రి- వాడొక్కడూ ఇంకా మిగిలున్నాడు,’’ అని దేవుడుతాత నిట్టూర్చాడు. అక్కడి నుంచి కదిలిపోతూ తాత, ‘‘ఒకసారి ఇంటి కొచ్చి కలిసిపోరా,’’ అని తలదించుకుని వెళ్లిపోయాడు.

దెబ్బ మీద దెబ్బ గుండెని తూట్లు పొడుస్తూ.

రాజ్యలక్ష్మిని చూట్టానికి వెర్రిగా తహతహలాడు తున్న మనసు ఇప్పుడు జంకుతోంది. హరించుకు పోయిన ఆస్తులు, జైలు కటకటాల వెనక శిక్ష అనుభ విస్తున్న భర్త, పగపట్టి కక్ష సాధిస్తున్న దుర్మార్గుడైన శత్రువు, మంటల మధ్య నుంచుని పోరాడుతున్న ట్టుంది రాజ్యలక్ష్మి. ఆ దశలో ఉన్న రాజ్యలక్ష్మిని చూడా లంటే దిగులుగా ఉంది.

ఉత్తరదిక్కుగా ఎదురుచేసిన పాతకాలపు ఆ పెంకుటిల్లు ఎత్తయిన అరుగులతో, పెద్ద పెద్ద ద్వారా లతో, గుండ్రటి రాటలతో, నగిషీ, కర్రపని తనంతో గత వైభవానికి గుర్తుగా కన్పిస్తోంది. ఊళ్లో శుభకార్యాలకు, దానధర్మాలకు, ఆపత్కాలంలో చేదోడు వాదోడుగా ఉండే ఆ ఇంటివేపు చూసేవారు జనం.

‘అమ్మా బాబాయి వచ్చారే’ అని అబ్బాయి కేక. రాజ్యలక్ష్మి కొడుకుల్లో చిన్నవాడు కావచ్చు. పదిహే నేళ్లుంటాయి. సన్నగా పొడుగ్గా ఉన్నాడు తండ్రి పోలికల్తో.

‘అక్కయ్యను పంపించకపోతే వచ్చేవాడేనా మీ బాబాయి?’

పలకరింపులు, కపట మర్యాదలు అన్నీ పక్కకు నెట్టేసి మనసులోని ఆవేదననంతా వెళ్లగక్కుకుంది రాజ్యలక్ష్మి. రోజూ మాటాడే మనిషితో మాటాడు తున్నట్టు వచ్చి పంచలో ఇత్తడి అండాలో ఉన్న నీళ్లు కాళ్లు కడుక్కోవటానికి తీసి ముంతతో ఇచ్చి, ‘‘మీ అన్నయ్య విశాఖపట్నంలోనే ఉన్నాడు చూశావా?’’ అని అడిగింది. తన భర్త సంజీవునాయుడు గురించి ప్రస్తా వించి.

ఆ ఊళ్లో అడుగు పెట్టినంతవరకు తనకు ఆ సంగతి తెలీలేదని క్షమాపణ స్వరంతో చెప్పుకున్నాడు. తన తమ్ముడి ద్వారా ఎప్పటికప్పుడు రాజ్యలక్ష్మి ముచ్చట్లు, ఊరు ముచ్చట్లు తెలుసుకుంటూ ఉండ వచ్చుననుకున్న రాజ్యలక్ష్మికి ఆశాభంగమయినది. కథ తెలిసి భర్తను వేణు విశాఖలో చూసి ఉండవచ్చునని కూడా ఆమెకు ఎందుకో అనిపించింది.

తన అంచనాలన్నీ తలకిందులైనందుకు కూడా ఆమెకు నిరాశ కలిగింది.

‘మీ తమ్ముడు ఏ సంగతీ నీతో చెప్పలేదన్న మాట,’ అని మాత్రం విస్తుపోయింది. అవును నిజమే తమ్ముడు ఎందుకు చెప్పలేదు? ఎందుకు ఉత్తరాల్లో రాయలేదు? ఊళ్లో తల్లిదండ్రులకు ఇబ్బందులు వచ్చి నప్పుడు కూడా వాడు ఈ దేశంలో ఉండి కూడా ఎందుకు పట్టించుకోలేదు? ఆ భోగట్టా తనకు ఎందుకు తెలియజేయలేదు?

రాస్తే మాత్రం ఏం చేసేవాడు? తల్లిదండ్రులు చనిపోతే కూడా రాలేని కొడుకు ఏం చేసేవాడు?

ఇప్పుడు తనకి గుర్తొస్తున్నాయి. సంసారంలో, పిల్లల్లో, ఉద్యోగంలో, పై పదవుల సాధనలో, బ్యాంకు ఖాతాను పెంచుకొనడంలో, అక్కడ ప్రపంచంతో పోటీ పడడంలో, పరుగులో, ఆ యావలో నిండా మునిగి పోయాడు. ఈ దీక్షమూలంగానే పెద్ద గుర్తింపు, పెద్ద సంపాదన, గొప్ప విజయాలు ఇవేళ సాధ్య మయ్యాయి. జీవితంలో తపస్సు చేశాడు! ఫలించింది! ఇప్పుడు అతడికి సంతృప్తిగా ఉంది సంతోషంగా ఉంది. ఆ సంతోషం తోనే అతడు ఈ ఊరు వచ్చాడు.

ఇక్కడ ఇప్పుడు వేణుగోపాల్ సంతోషంగా లేడు.

ఈ అపరాధాన్ని క్షమిస్తుందా రాజ్యలక్ష్మి!

‘‘బాబయ్యా! బాబయ్యా,’’ అని ఇంటి లోపలి నించి ఇద్దరు యువకులు వచ్చి పలకరించారు. ఇరవై యేళ్లు దాటినవాళ్లే. సంజీవనాయుడు పోలికలు మూలంగా వాళ్లు రాజ్యలక్ష్మి కొడుకులే అని గుర్తు పట్టాడు. అప్పటికే దాదాపు పదిహేనుమంది అక్కడ చేరారు వాళ్లలో చాలామందిని వేణుగోపాల్ అసలు గుర్తుపట్టలేదు. వాళ్లని తను చూడలేదు. గుర్తుపట్టిన వాళ్లనందరినీ పేరు కూడా గుర్తు తెచ్చుకుని పేరుతో పిలిచి యోగక్షేమాలు అడుగుతున్నాడు.

ఇరవై మందయ్యారు. పాతిక, ముప్పయి. అంతా వేణుగోపాల్‌ని చూట్టానికి ఊళ్లో మనుషులు. జగ్గు నాయుడు గడప తొక్కని మనుషులు.

'మీ బాబయ్య మన దగ్గరున్నప్పుడే మన మనిషి చాటయిపోతే మనం ఉన్నామో తిన్నామో లేదో పట్టించు కోని మనిషి' అని మనసులో ఉన్నమాట అనేసింది రాజ్యలక్ష్మి. ఒకప్పటి అతడి ఆరాధన మూలంగా ఏర్పడిన చనువు ఆ గొంతులో. ఇంకా ఆ పెత్తనం చెల్లు తున్న ప్రేమాతిశయం. రాగద్వేషాలను దాచుకోలేని నిష్కాపట్యం.

షూస్ విడిచి, సాక్స్ తీసి, ఆమె అందించిన నీళ్లతో కాళ్లు కడుక్కుని అరుగు మీద కూచున్నాడు వేణుగోపాల్. సంజాయిషీ వెతుక్కుంటోంది అతడి మనసు.

అన్ని సముద్రాలు దాటి, దేశాలు దాటి, తన స్వప్న జగత్తులో ప్రతిష్ఠితమైన ఈ దేవతా దర్శనం కోసమే వచ్చినట్టు ఎట్లా మనసు విప్పి చెప్పుకోవాలి? నిన్ను చూడకుండా, నీ కష్టసుఖాలు తెలుసుకోకుండా, నీ చేత్తో పెట్టిన అన్నం తినకుండా ఎట్లా వెళ్లిపోతాననుకున్నావ్? సంజీవు విశాఖపట్నంలో జైల్లో ఉంటాడని నేను కల గన్నానా? దాన్ని- ఆ కీడుని కలగననందుకు నన్నే నిందించాలా! అని మనసు మూలుగుతోంది. కాని గొంతు పలకదు.

ఆ భావ సందేశాలన్నీ అతడి చూపుల్లోంచి ఆమెలోకి ప్రసారం అవుతూనే ఉన్నాయి. స్నేహపు అంత ర్వాహిని దానంతటదే వెళ్లి హృదయాన్ని స్పృశిస్తోంది.

అంతలో గాలీధూళిలా వచ్చాడు సిమ్మాద్రి. 'నేస్తం ఎప్పుడొచ్చావు నేస్తం' అని కూచున్న వేణు గోపాల్‌ని అందుకుని అమాంతం కావలించేసుకు న్నాడు. శంక్రరావు, వేణుగోపాల్, సిమ్మాద్రి పనుల కాపరి నేస్తాలు. సిమ్మాద్రిది గొర్రెలమంద. తండ్రి కాలం నించి కౌలు చేస్తున్న తోటలో గొర్రెలమందే సిమ్మాద్రి ఆస్తి. తనకూ, శంకర్రావుకూ ఆవుల మందలుండేవి. తను మూడు నాలుగెకరాల చిన్న చిన్న తోటల్లో.

ఇప్పుడు శంకర్రావు ఆ ఊరు జనానికి అంద నంత ఎత్తు ఎదిగిపోయినా నేస్తం సిమ్మాద్రి మాత్రం గొర్రెల కాపరిగానే మిగిలాడు. వేణుగోపాల్ ఊళ్లో వున్న సంగతి ఇప్పుడే నూతి దగ్గర విని, నీళ్ల కావిడిని అక్కడే విడిచిపెట్టేసి పరుగు పరుగున చిన్ననాటి నేస్తాన్ని చూట్టానికి వచ్చాడట.

బాల్యాన్ని గొర్రెపిల్లలా జీవితాంతం కాపాడు కున్న చూపులు. గాలివానలకీ, కరవుకాటకాలకీ, అంటు రోగాలకీ, నిత్య పేదరికానికీ, దోపిడీ దౌర్జన్యాలకీ, భోగ భాగ్యాల వికటాట్టహాసాలకీ, కష్టాలకీ, కన్నీళ్లకీ ఎదురొడ్డి చేవతీరిన శరీరం. పొడుగ్గా సన్నగా నుంచోబెట్టిన బల్లెం లా, మండుతోన్న కాగడాలా ఉన్నాడు నేస్తం. జుత్తు పలచబడిందే తప్ప నెరుపు కనిపించలేదు. అలసి పోయినట్టున్నాడే తప్ప సడలిపోలేదు నేస్తం. తనవి తీరా ఒకర్నొకరు చూసుకున్నారు.

అక్కడ చేరిన జనం సంఖ్య ఇంకా పెరిగింది! కొందరు సర్దుకుని విశాలమైన అరుగుల మీద చుట్టూ కూచున్నారు. కొందరు గోడలకి చేరగిలబడి, ఇంకొం దరు రాటలకు అనుకొని వేణుమాటాడితే వినాలని అతడిని చూస్తూ నుంచున్నారు.

సంజీవునాయుడు జైల్లో మూడేళ్లుగా ఉన్నాడట. పదిహేనురోజుల్లో విడుదలై తిరిగి వచ్చేస్తాడట. అక్కడ చేరిన ఆడా మగా చిన్న పెద్దా అంతా సంజీవునాయుడు కోసమే ఎదురుచూస్తున్నట్టు కన్పించారు వేణుగోపాల్‌కి.

"సంజీవు బావే ఇప్పుడు ఊళ్లో ఉండే నా నేస్తం," అని ఆ ఆనందాన్ని తన ముఖం మీద చూపించాడు.

సంజీవునాయుడుకు ఆ రోజుల్లో మంచి స్నేహి తుడు శంకర్రావే. అట్లాంటిది ఈ రెండురోజుల్లో శంకర్రావు నోట ఆ పేరు కూడా వినలేదు. చివరికి జగ్గు నాయుడు విందులో వచ్చిన ప్రస్తావనలో కూడా శంకర్రావు నోట ఆ పేరు వినిపించలేదు. సంజీవు నాయుడుతో బంధుత్వం తప్ప స్నేహంగాని, సన్ని హితత్వంగానీ లేదు వేణుగోపాల్‌కి. తనకన్న వయసులో నాలుగయిదేళ్లు పెద్ద కావటం వల్లా, వాళ్లది బాగా కలిగిన కుటుంబం కావటం వల్లా వాళ్లు దగ్గర కాలేదు. యూనివర్సిటీ చదువులో తాను బాగా రాణించినట్టు తెలిసినప్పుడూ, ఒకదాని తర్వాత ఒకటి మంచి ఉద్యోగాలు వచ్చి వాటిలో చేరినప్పుడూ అభిమానంగా ప్రశంసించాడు తనని సంజీవునాయుడు.

తరతరాలు తిన్నా తరగని ఆ సంజీవునాయుడు ఆస్తులు ఇప్పుడు ఇరవైయేళ్లలోనే హారతి కర్పూరంలా హరించుకుపోయినాయంటే ఆశ్చర్యంగానే ఉంది.

అరుగుమీద ఒక మూల పడి ఉన్న పొడుగు పిడికత్తి అందుకుని, వాకిట్లోనే ఉన్న చెన్నంగి చెట్టు నించి నుంచునే ఒక కొబ్బరికాయ అందుకుని, అందం గా వొలిచి, పైన సుతారంగా కొట్టి, మూత తెరిచినట్టు దాన్ని తీసి స్నేహహృదయం ఉప్పొంగుతున్న ఆనందం తో వేణుగోపాల్‌కి అందించాడు సిమ్మాద్రి.

'నేస్తం ఈ బూమ్మీద నూకలు ఇంకా మిగిలాయి నాకు. నిన్ను చూడగలిగాను. ఆ సంజీవు బావధర్మమా అని నా పిల్లలకు తండ్రినై బతికే ఉన్నాను.' ఆప్త

హృదయం కనిపించేసరికి దుఃఖం ముంచుకొస్తుంటే కష్టాలు చెప్పుకుంటున్నాడు సిమ్మాద్రి.

*

తండ్రి కాలం నుంచి గత డెబ్బై ఏళ్లుగా కౌలు చేస్తున్న జీడితోటలో గొర్రెల మందతో బతుకుతున్న సిమ్మాద్రికి పాతికేళ్ల క్రితం జగ్గునాయుడు ఒక సమస్య సృష్టించారు. ఆ తోట యజమానులు టౌన్‌లో ఉంటున్నారు. కొబ్బరికాయ ధర పెరగడంతో భూముల మీద ఆసక్తి పెరిగి ఆ తోట మీద జగ్గునాయుడు కన్నుపడింది. అప్పటికే జగ్గునాయుడు పాతిక ఎకరాల వరకు తోటలు కొత్తగా ఆర్జించాడు. ఏకఖండంగా ఉన్న ఈ పదిహేను ఎకరాల తోట నామమాత్రం ధరకే జగ్గునాయుడు కొనుక్కుంటున్నట్టు తోట యజమానుల ద్వారా సంజీవునాయుడుకు తెలిసింది. ఈ సంగతి సిమ్మాద్రి చెవులో వేసి, 'ఆ ధరకి నీవే తీసుకోరాదా,' అని మాటసాయంగా సలహా ఇచ్చాడు.

దాంతో మొదలయింది జగ్గనాయుడుకు సంజీవునాయుడు మీద కోపం.

తోటలో జీడిమొక్కలే ఎక్కువగా ఉన్నప్పటికీ ఆ తోటలోనే బతుకుతున్న సిమ్మాద్రికి సంజీవునాయుడు సలహా ఎంతో బలాన్నిచ్చింది. పదిహేను ఎకరాల జీడితోట తన ఆస్తిలో కలుస్తున్నట్టే ఆశించిన జగ్గనాయుడుకు సిమ్మాద్రి అడ్డు తగలటం తనతో కయ్యానికి కాలు దువ్వుతున్నట్టే అనిపించింది. ఆ వెనక ఉన్నది సంజీవనాయుడే అయినా సంజీవనాయుడితో ముఖాముఖి ఢీకొనడానికి ధైర్యం చాలక సిమ్మాద్రి మీద పడ్డాడు జగ్గునాయుడు.

దుర్మార్గులకు దూరంగా ఉండాలంటారు. సంజీవునాయుడు కూడా అట్లా జగ్గునాయుడుకు దూరంగానే ఉండేవాడు.

తోట యజమానులతో కలిసి జగ్గునాయుడు కావాలని భూమిధర రెట్టింపు చేశాడు. కౌలు మార్పించే ప్రయత్నం చేశాడు. సిమ్మాద్రిని ఊళ్లో తన అనుచరుల ద్వారా భయపెట్టాడు. దాంతో తోట యజమానులకూ కౌలుదారుకూ మధ్య ఆ తోట విక్రయ వ్యవహారం తగువుగానే ఉండిపోయింది. ఆ తర్వాత అయిదారేళ్లలో ఊళ్లో జగ్గునాయుడు మరింత బలపడ్డాడు.

వేణుగోపాల్‌కి అంతవరకు తెలిసిన కథే.

సరిగ్గా ఇరవైయేళ్ల కిందట....

జిల్లాలో ప్రారంభమైన నక్సలైట్ ఉద్యమం మూలంగా నక్సలైట్లు భూస్వాములను చంపటంతో ఆ తాలూకాలను ప్రభుత్వం కల్లోల ప్రాంతంగా ప్రకటించింది. గ్రామాలలో భూస్వాములు, పెద్ద రైతులు తమ రక్షణకోసం పోలీస్ బలగాలను తెచ్చుకున్నారు. నక్సలైట్లతో సంబంధం ఉందనుకున్న వాళ్లను పోలీసులకు అప్పగించడం, వాళ్లను జైళ్లల్లో పెట్టించడం, చంపించడం మామూలై పోయింది. దాంతో ఊళ్లలో పరిస్థితి భయంకరంగా తయారయింది.

ఆ ఊళ్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన సంజీవునాయుడు అతడి స్నేహితులు, బంధువులు నాలుగయిదు కుటుంబాలు తప్ప మిగిలిన గ్రామం మొత్తం స్వతంత్ర పార్టీకి చెందిన జగ్గునాయుడు పెత్తనంలో వుండేది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని ఏలుతున్న రోజుల్లో కూడా ఈ ఊళ్లో కాంగ్రెస్ వాళ్ల మీద దెబ్బ తీసేవాడు జగ్గునాయుడు.

మూడు రోజుల్నించి పెద్ద ముసురు. చలిగాలులూ. జల్లులు జల్లులుగా పెద్ద వర్షాలు. ఎక్కడో సముద్రం లోపల తుపాన్ పుట్టిందట. పశువులు, గొర్రెలు, మేకలు సాలల్లో కట్టు మీదే ఉండిపోయాయి. ఆ ముసురులో ఒక రాత్రి సంజీవునాయుడు తాటి గొడుగు పట్టుకుని తోటలో కాపురం ఉంటున్న సిమ్మాద్రి కోసం వెళ్లాడు. 'పద' అని తనతో పరుగు పరుగున తీసుకుపోయాడు. వాళ్లు ఆ చీకటిలో దాదాపు వందగజాల దూరంలో జీడితోపుల వెనక్కి వెళ్లారో లేదో టార్చిలైట్ వెలుగు చుట్టుముట్టింది ఇంటిని.

'నక్సలైట్‌వని నిన్ను కాల్చి చంపేయటానికి పోలీసులు ఇప్పుడొచ్చారు,' అని ఇంకా ఓ కిలోమీటరు దూరం పారిపోయిన తర్వాత సంజీవునాయుడు చెప్పాడు.

ఆ రోజుల్లో కాన్పు కోసం వెళ్లిన భార్య అదృష్టవశాత్తూ కన్నవారింట్లో ఉండటంతో ఆ బెంగ లేకుండా పోయింది. ఆ రాత్రి ఆ ముసురులో తడుచుకుని పొరుగూరు వెళ్లి కాంగ్రెస్ పెద్దమనిషికి సిమ్మాద్రిని అప్పగించి, వాడి ప్రాణం కాపాడమని వేడుకొని అదే రాత్రి ఇల్లు చేరుకున్నాడు సంజీవునాయుడు.

ఆ గండం అప్పటికి తప్పినా, పోలీస్ పై అధికారులతో కలుసుకుని ఐదారేళ్లుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ రసీదులు చూపించి రాజకీయ నాయకుల చుట్టూ, ప్లీడర్ల చుట్టూ తిరిగి, లంచాలు వేలల్లో చెల్లించుకున్న వరకు ప్రాణాపాయభీతి తప్పలేదు సిమ్మాద్రికి. తర్వాత కూడా రెండేళ్లపాటు పొరుగూర్లో ఆ కాంగ్రెస్ పెద్దమనిషి ఇంట్లో ఉండి ప్రాణం కాపాడుకున్నాడు సిమ్మాద్రి.

ఆ ఊళ్లో సంజీవునాయుడు అనుయాయులనూ, వేణుగోపాల్ తండ్రి రామ్మూర్తినాయుడు కూడా- నక్సలైట్‌లకు తిండిపెడుతున్నారని, ఆశ్రయం ఇస్తున్నా

రని, అండదండలందచేస్తున్నారని, అంతా కాంగ్రెస్‌వాళ్లే అయినా పోలీసుల మద్దతుతో అరెస్ట్ చేయించి కేసుల్లో ఇరికించి సాధించాడు జగ్గునాయుడు. ఆరోజుల్లో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అనామకులుగా ఉండటంవల్ల, జిల్లాలో పెత్తనం సాగిస్తున్న స్వతంత్ర పార్టీని ఎదుర్కొనే స్థితిలో లేకపోయింది. సంజీవునాయుడు మొండిగా వ్యక్తిగతస్థాయిలో పోట్లాడాడే తప్పించి దాన్ని రాజకీయంగా పార్టీస్థాయిలో ఎదుర్కోలేకపోయాడు. జగ్గునాయుడు నిజస్వరూపం బట్టబయలు చేయడంలో విఫలుడయ్యాడు.

అన్నీ వీరోచిత సాహసగాథలే. ఊరే యుద్ధభూమి. నిత్యం సమరమే. ఒక్కోసారి ఒక్కో ఇంటిమీద, ఒక్కో సందర్భంలో ఒక్కో కుటుంబం మీద. ఒక్కో ఆయుధంతో ఒక్కో ఆస్తి మీద దాడి, దౌర్జన్యం. అప్పు కోసం వచ్చిన వాళ్ల ఆస్తులు కాజేయడం. భార్యాభర్తలను విడదీయడం. తల్లీకొడుకుల మధ్య అగ్గిపెట్టడం, తండ్రి మీద కొడుకును ఎగదొయ్యడం, అన్నదమ్ములకు కత్తులందించడం, నమ్మించి గోతులు తవ్వడం. ఇరుగు వారి మీద పొరుగువారిని ఉసికొల్పడం, గట్టు మీద తగవు, కాయమీద తగవు. ఆపదలు సృష్టించి ఆస్తులు కాజేయడం, కుట్ర మీద కుట్ర 'దగా దగా' పంచాయితీ పేరున పెత్తనం, న్యాయం పేరున పెత్తనం. ఊరుకట్టు అని చెప్పి దోపిడీ. వందల రూపాయలు, వేల రూపాయలు తప్పులు, దండనలు, జరిమానాలు, పొలమూ పుట్రా అమ్మించి- బండీ ఎడ్లూ అమ్మేసి- గొర్రెలమందలూ, మేకలమందలూ తీసుకుని, ఇళ్లస్థలాలూ, భూములూ కాజేసి, నగలూ బంగారాలూ తాకట్టు పెట్టించి, కాగితాలు రాయించుకుని, రిజిస్ట్రేషన్‌లు చేయించుకుని, పడని వాళ్ల ఇళ్లలో చిచ్చుపెట్టి పెళ్లి సంబంధాలు తప్పించి...

అమ్మకం పేరుతో దగా. వర్తకం కమిషన్ పేరుతో ద్రోహం. వడ్డీల పేరుతో మోసం. గాలివాన వచ్చి సర్వం కోల్పోతే ప్రభుత్వం ఇచ్చిన సహాయమంతా వాళ్లే కాజేసి, ఇచ్చన రుణాలన్నీ వాళ్ల చేతుల్లోకే. కోపరేటివ్ బ్యాంకులిచ్చే అప్పులన్నీ వాళ్ల వడ్డీలకిందే. పంట మీద వచ్చిన ఆదాయమంతా వాళ్లదే. పొలం మీద వచ్చిన ఫలసాయమంతా వాళ్లదే. తిండిలేక, జబ్బులొస్తే వైద్యుడిని చూడలేక, మందులు కొనుక్కోలేక, ఆస్పత్రుల్లో మందులు దొరక్క.

ఆ యుద్ధంలో శంకర్రావు తటస్థంగా ఉండి జగ్గునాయుడు మన్ననలను పొందాడు.

ఊళ్లోని స్త్రీలూ, పెద్దలూ, వృద్ధులూ అంతా సాహసికుల్లాగా కనిపించారు. యోధానుయోధులై సాగిస్తున్న సంగ్రామం.

ఆ యోధులకు ప్రతినిధిగా కనిపిస్తున్నాడు సంజీవునాయుడు.

సిమ్మాద్రి, నర్రోడు, గున్నోడు, గుర్నాథం, చంద్రన్న, దాసు, కృష్ణమూర్తి చదువుకున్న వాళ్లూ, చదువులేని వాళ్లూ, బడిపంతుళ్లూ, అందరిదీ ఒకటే కథ. తమమీద పిడుగు పడినప్పుడు గిలగిలకొట్టుకుంటూ సాగించిన పోరాటం. తమ మీద గుండు గురిపెట్టినప్పుడు విలవిల్లాడుతూ ఎదురుతిరిగే పోరాటం.

రాజ్యలక్ష్మి ముఖం మీది వెలుగు అదే. కష్టాలలో ఉన్నవాళ్లకు చేయి అందించే వెలుగు. ఏడుస్తూ వచ్చే వాళ్ల కన్నీళ్లు తుడిచే వెలుగు, పోరాటాలకు భయపడని వెలుగు. త్యాగాలకు వెనుకాడని వెలుగు. కష్ట పరంపరలకు వెన్ను చూపని వెలుగు. శత్రుబలగాలకు దడ పుట్టించే వెలుగు. తన భర్తని ఈ దుర్మార్గం మీద ఎక్కుపెట్టిన బాణంగా సానపట్టిన వెలుగు. ఆ వెలుగు అక్కడ చేరిన మనుషుల ముఖాల్లో ఇప్పుడు ప్రతిఫలిస్తోంది. ఒకప్పుడు జగ్గునాయుడుకు భయపడి ఆ ఇంటి ముందునించి పోవటానికి కూడా జంకిన మనుషులు ఇప్పుడు ఆ ఇంటిని తమ దుర్గంగా మార్చుకున్నారు.

ఆ పగలంతా వేణుగోపాల్ ఊళ్లో తిరిగాడు. స్నేహితుల దగ్గరకు, బంధువుల దగ్గరకు. వాళ్లు చెప్పిన కథలు, బాధలు విన్నాడు.

వేణుగోపాల్‌కి చాలా ఆశ్చర్యం కలిగించిన సంగతి ఏమిటంటే ఊళ్లో జనం తిడుతున్నది జగ్గునాయుడినీ, వాడి చిన్న తమ్ముడినే, శంకర్రావు మీద ఒక్కడూ పెదవి విప్పలేదు.

రాత్రి భోజనం దగ్గర రాజ్యలక్ష్మి ఒక మాట అంది.

'మీ బాబాయి ఒక ఆపదకి అక్కరకొచ్చేవాడా ఒక అవసరానికి అక్కరకొచ్చేవాడా.' ఆ మాట వేణుగోపాల్ మనసులో గట్టిగానే నాటుకుంది. నిజమే సంజీవునాయుడు ఊళ్లో ఉండటంవల్ల ఆ జనం ఆపదల్లో, అవసరాల్లో అక్కరకు వస్తున్నారు.

ఆ ఊళ్లో ఉన్నంత మాత్రాన తాను సంజీవునాయుడులా ఉండేవాడా?

రాత్రి భోజనం తర్వాత కూడా చాలాసేపు అక్కడే ముచ్చట్లలో పడ్డారు. ఇప్పుడు అక్కడున్న ఆ యువకులు సంజీవునాయుడు వారసులే అన్పించారు వారి ప్రశ్నల్లో, వారి మాటల్లో.

ఒక కుర్రాడు అడిగాడు- 'పెదనాన్నా అమెరికాలో నీకు చాలా పెద్ద పేరు ఉందంటున్నారు కదా! అదేమిటి?' ఆ యువకుడు ఆ ప్రశ్న అమాయకంగా అడిగినట్టు ధ్వనించలేదు.

న్యూక్లియర్ సైంటిస్ట్‌గా తనకున్న ఘనత గురించి వాళ్ల భాషలో ఏమని చెప్పాలి. 'నీ పేరు ప్రఖ్యాతులతో మరింత పెద్ద ఉద్యోగం, మరిన్ని లక్షల డాలర్లూ సంపాదించి ఉంటావ్ కదా పెదనాన్నా,' అని కూడా అన్నాడు ఆ యువకుడు. శాస్త్రరంగానికి సైతం తాను ఇచ్చిన మలుపు ఏమున్నది?

అర్ధరాత్రి పండుకోవటానికి శంకర్రావు ఇంటికి వేణుగోపాల్ వచ్చేసరికి అరడజను మంది స్నేహితులతో కొలువుతీరి ఉన్నాడు శంకర్రావు. ఇంటిముందు కొత్త కార్లు మరో మూడు ఆగి ఉన్నాయి. విందులో ఉన్నారు. పెద్ద ఎత్తునే. ఆప్రాంతంలో సినిమా షూటింగ్ ప్రారంభం సందర్భంగా ఇవేళ వాళ్లు వచ్చారట. ఆ చిత్రం నాయకి దేశంలో పేరుపొందిన నెంబర్‌వన్ దక్షిణాది హిందీ అగ్రతారట. ఆ నాయకుడు తెలుగు సినిమా రంగాన్ని ఏకఛత్రాధిపతిగా ఏలుతున్న నటభాస్కరుడట. ఆ చిత్ర దర్శకుడు హిందీ, తెలుగు చిత్రాలలో కనకవర్షం కురిపిస్తున్న దర్శక వజ్రమట. ఆ చిత్ర నిర్మాత శ్రీశైలం ప్రాజెక్ట్‌లు, విశాఖ ఉక్కు కర్మాగారాలు, రాజస్థాన్ కాలవలూ నిర్మించిన ప్రముఖ పారిశ్రామిక కంట్రాక్టరట! 'మన స్నేహితులు' అని నెమ్మదిగా జిన్ సిప్ చేస్తూ పరిచయం చేశాడు స్నేహరత్న శంకర్రావు.

విందులో ఎవరి మాటల్లో వాళ్లు ఉండగా, సంజీవునాయుడు కుటుంబం పరిస్థితి ప్రస్తావన కావాలనే తెచ్చాడు వేణుగోపాల్, శంకర్రావుతో.

"వెర్రిబాగులవాడు. జగ్గునాయుడుతో అనవసరంగా ఢీకొన్నాడు. ఊళ్లోవాళ్ల కష్టాలన్నీ వీడివే. వాళ్లు వచ్చి బాబ్బాబు, మీరు ధర్మరాజు అని ఉబ్బేస్తే, ఆస్తులు తగలెట్టుకుని వాళ్ల వెంబడి పోలీస్‌స్టేషన్‌లకి, కోర్టుకి, ఆస్పత్రులకి, లాయర్ల దగ్గరకి, హైదరాబాద్, ఢిల్లీ నగరాలకి తిరిగి వాళ్ల తప్పులకు ఇప్పుడు వీడు జైల్లో పడ్డాడు. వాళ్లు తప్పించుకున్నారు.

"మన మనుషులున్నారే- వాళ్లు కష్టాలు చెప్తే నీవూ కన్నీళ్లు పెట్టుకునే ఉంటావ్- వాళ్లు చాలా తెలివైన వాళ్లు. తమ తరపున ఎవడు కత్తిపట్టుకుని ప్రాణాలు ధారపోయడానికి సిద్ధంగా ఉన్నాడో చూసి, వాడి వెంట పడతారు. వాడి చుట్టూ తిరుగుతారు. వాళ్లు స్వయంగా కత్తి పట్టుకోరు. ఒక ఉబ్బులింగడుని ముందు నిలబెట్తారు. అట్లాంటి ఉబ్బు లింగడు సంజీవునాయుడు వాళ్లకి బాగా దొరికాడు.

"ఈ గాడిద కొడుకుల బుద్ధి నాకు తెలుసు. వాళ్ల గాలికూడా సోకనివ్వను. మనమూ తటస్థం. అటు జగ్గునాయుడుతోనూ వైరం లేదు నాకు. ఇద్దరూ మనకు కావలసిన వాళ్లే ఇద్దరూ మంచివాళ్లే. ఎవడో వచ్చి ఉబ్బేస్తే ఉబ్బి పోయేరకం కాదు మనం. ఎవరి కష్టాలు వాళ్లవి. ఎవడి చావు వాడిది. వాళ్ల యుద్ధం వాళ్లే చూసుకోవాలి. మనకేంపట్టింది? వాడికోసం మనం కత్తెందుకు పట్టుకోవాలి ?

"ఒక్క సంజీవు దగ్గర్నించే బంగారంలాంటి ముప్పైయ్యెకరాలు కొన్నాను. ఇప్పుడు వాడి తోటలన్నీ మనవే. ఈ ఊళ్లో జగ్గునాయుడుకు పోటీగా సంజీవనాయడు భూములు మరొకడు కొనలేడు. సంజీవునాయుడు చచ్చినా జగ్గునాయుడుకు అమ్మడు."

అని శంకర్రావు అవకాశవాదపు ఎత్తుగడతో తన విజయ రహస్యం ప్రకటించాడు.

ఇక్కడ ఈ ఊళ్లోనే ఉంటే శంకర్రావును అయ్యేవాడినేమో అనుకున్నాడు వేణుగోపాల్.

సిమ్మాద్రికి ఆరోజు వచ్చిన ఆపదలో సంజీవనాయుడు స్థానంలో శంకర్రావే ఉంటే ఏమయ్యేదో ఊహించుకుని వణికిపోయాడు వేణుగోపాల్.

*ఇండియా టుడే పక్షపత్రిక, 6-20 సెప్టెంబర్ 1990*

